క్లుప్తంగా

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రిన్సిపాల్‌కు మొక్క అందిస్తున్న విద్యార్థిని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రకృతి సంపద అయిన అడవులను సంరక్షించడానికి విద్యార్థులు, యువత బాధ్యత తీసుకోవాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరా బాబు సూచించారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని వివరించారు. జంతు శాస్త్ర అధ్యాపకులు విజయకుమార్ మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యతను వివరించారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించం



లౌడ్ స్పీకర్లను తొలగిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఇటీవల ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏలూరు నగరంలో శుక్రవారం ఆటోలు, ఇతర వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. వాహన తనిఖీ అధికారి రమేష్ బాబు, జగదీష్ 45కి పైగా ఆటోల్లోని లౌడ్ స్పీకర్ల కనెక్షన్లను తొలగించారని, వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను తీయించివేశారని వివరించారు.

ఇంగ్లిష్ పరీక్షకు 4,137 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 4137 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 22 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 4,161 మంది రెగ్యులర్ విద్యార్థులకు 4132 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు ఏడుగురికి ఐదుగురు పరీక్ష రాశారు. ఈ పరీక్షను ఎంఈఓ డి.వెంకట రమణ పర్యవేక్షించారు.

మార్చిలోనే మాడు పగులుతోంది!

- ప్రస్తుతం 38 డిగ్రీల వరకు నమోదు
- నెలాఖరు నాటికి 42 డిగ్రీలకు చేరనున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు







ఎండలతో నిర్మానుష్యంగా ఉన్న ఏలురులోని ఒక ప్రధాన రహదారి, ఎండ వేడిమికి తలపై ముసుగులు వేసుకుని తిరుగున్న వృద్ధుడు, మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి కాలం అప్పుడే వచ్చేసింది. గతంలో మార్చి నెలాఖరు వరకు పెద్దగా ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి కావు. ఏప్రిల్ మొదటి వారం నుంచి సుమారు 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. పర్యావరణ మార్పుల కారణంగా గత రెండేళ్ల కాలంలో ఫిబ్రవరి, మార్చి నెలల నుంచే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదౌతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాల కంటే ఏలూరులో కొద్దిగా భిన్నమైన వాతావరణం ఉంటుంది. నగరం చుట్టూ తమ్మిలేరు, కృష్ణా కాలువ, గోదావరి కాలువ ద్వారా నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అలాగే నగరానికి సుమారు 7 నుంచి 8 కిలోమీటర్ల దూరంలోనే కొల్లేరు సరస్సు ఉండడంతో ఆ నీటి ప్రభావంతో నగరం కొంత చల్లగానే ఉండేది. కానీ ఇటీవల ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో నమోదు కావడం చూస్తుంటే ఈ నీటి ద్వారా వచ్చే శీతల గాలులు సైతం ఉష్ణోగ్రతలను నివారించడంలేదని అర్థమౌతోంది.

పెరిగిన ఉష్ణోగ్రతలు

సాధారణంగా శివరాత్రితో శీతాకాలం వెళ్లిపోతుందని ప్రజలు విశ్వసిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న శివరాత్రి కాగా, ఆ తరువాత వారం పది రోజుల వరకూ వాతావరణంలో పెద్దగా మార్పులు కనపించలేదు. మార్చి నెల 2వ వారం నుంచి ఒక్క సారిగా వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. గత వారం రోజులుగా ఏలూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో 32 డిగ్రీల నుంచి 35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై వేసవిని తలపించింది. వేసవి ఆరంభంలోనే ఇంత ఎక్కువగా ఎండలు ఉంటే మరో మూడు నెలల పాటు కాలాన్ని ఎలా వెళ్లదీయాలోనని ప్రజలు నిట్టూర్పులు విడుస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతలు

వచ్చే వారమంతా ఎండలు మరింతగా ముదిరిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వచ్చే వారంలో 26వ తేదీన 39 డిగ్రీలు, 27న 42 డిగ్రీలు, 28న 43 డిగ్రీలు, 29న 43 డిగ్రీలు, 30 నుంచి కొద్దిగా తగ్గి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని ప్రకటించింది. గత రెండు మూడేళ్లుగా మే నెలలో నమోదైన ఉష్ణోగ్రతలు ఈ ఏడాది మార్చి నెలలోనే నమోదు కాబోతున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

రానున్న భారీ ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్నపు ఎండల్లో బయట తిరిగే వారు తప్పనిసరిగా టోపీలు ధరించాలి. లేదా గొడుగులు వినియోగించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు మంచినీరు అధిక మోతాదులో తాగాలి. ఎండ నుంచి ఇంటికి వచ్చిన వారు వెంటనే ఏసీ రూముల్లోకి వెళ్లకూడదు. వడదెబ్బ తగిలిన సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. తరచూ కొబ్బరి నీరు తాగాలి. తినే ఆహారంలో సైతం నీటిశాతం అధికంగా ఉండేలా జాగ్రత్తపడాలి.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్) : మహిళలకు స్వయం ఉపాధి పథకాలను ప్రవేశ పెట్టాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల దళిత సేన ఆధ్వర్యంలో లావేటి ప్రవల్లిక టీచరు మూడు నెలలు కాలం కుట్టు శిక్షణ ఇచ్చారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను రవి ప్రకాష్ అందజేశారు. మహిళలకు కుట్టు శిక్షణతోపాటు ఉచితంగా కుట్టు మెషీన్లు, సబ్సిడీ రుణాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, దళిత సేన ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిఖకొల్లు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోమ్ బోర్డుల అందజేత



ఫోమ్ బోర్డులను అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ, సిఫిలిస్ వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించే ఫోమ్ బోర్డులను శుక్రవారం స్థానిక పవర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి ఎం నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. డాక్టరు గౌతం, పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎ.హరినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు



వెన్నవల్లివారిపేటలో డ్రెయిన్ ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

ఏలూరు(టూటౌన్): ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని వెన్నవల్లివారి పేటలో డ్రెయిన్లపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది పోలీసుల సహకారంతో శుక్రవారం తొలగించారు. స్థానిక మహిళలు ఇరువైపులా తొలగించకుండా కావాలనే ఒక్కవైపు ఆక్రమణలు తొలగించడం ఎంత వరకు సమంజసమంటూ అధికారులను నిలదీశారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం వన్‌టౌన్ పోలీసుల సహకారంతో ప్రొక్లెయిన్ సాయంతో ఆక్రమణలను తొలగించారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారులు మాట్లాడుతూ డ్రెయిన్లు ఆక్రమించారనే ఫిర్యాదు మేరకు తొలగిస్తున్నట్టు చెప్పారు.

కారుణ్య నియామకం

ఏలూరు(మెట్రో): ఏలూరు జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం అంగలూరి సునీతకు కారుణ్య నియామక పత్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ అందజేశారు. సునీత భర్త అంబటి రాజేష్ మృతిచెందడంతో కారుణ్య నియామకం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ భీమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13కు వాయిదా

పెదపాడు : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఏప్రిల్ 6న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్టు వట్లూరు బీఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

భీమడోలు జంక్షన్‌కు రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు



భీమడోలు జంక్షన్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం ఎదురు చూస్తున్న జనం



భీమడోలు బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రాక భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వచ్చే అరకొర ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు నేషనల్ హైవే విస్తరించడంతో ఎక్స్‌ప్రెస్‌లన్నీ హైవేపై వెళ్తున్నాయి. గతంలో తప్పనిసరిగా భీమడోలు జంక్షన్‌కు వచ్చి వెళ్లే ఆ బస్సులన్నీ కొత్త హైవేపై నుంచి వెళ్లిపోతున్నాయి. భీమడోలు జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు అనేకసార్లు వినతులు అందించినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు, ప్రయాణికులు భీమడోలు జంక్షన్‌లో పడుతోన్న పాట్లు వర్ణనాతీతం. ఇక్కడ బస్టాండ్ ఉన్నా ప్రాంగణంలోకి పల్లె వెలుగు బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళ్లవు. బస్టాండ్‌కు బయట రోడ్డుపై ఎక్స్‌ప్రెస్, ప్రైవేటు వాహనాలు వస్తే కుటుంబ సమేతంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తుంది. శని, ఆదివారాలతో పాటు శుభ దినాల్లో రెట్టింపు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని వాపోతున్నారు. నిత్యం ఈ ప్రాంగణం నుంచి 2,500 మంది ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు, ప్రయాణికులు ద్వారకాతిరుమలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్యాసింజర్ బస్సుల కోసం ప్రాంగణంలో, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం బయటకు ప్రయాణికులు నానా హైరానా పడుతున్నారు. భీమడోలు జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేలా తగు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

నూకాలమ్మ కలశాల ఊరేగింపు



కలశాల ఊరేగింపులో పాల్గొన్న సువాసినీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ వారి 45వ జాతర మహోత్సవాలు దేవాదాయ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు నిర్వహించనున్న మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శాస్త్రి అమ్మవారికి స్నాన కార్యక్రమంతో పాటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, డప్పువాయిద్యాల నడుమ 216 మంది మహిళలు, సువాసినీలు కలశాలతో పాదయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారికి స్నాన కార్యక్రమంలో అభిషేకాలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దావాలా రంగ సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిది రోజులు జరిగే ఈ మహోత్సవాల్లో భక్తులంతా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ఈఓ మీసాల వెంకట్రావు, జంపా సూర్యనారాయణ, కొఠారి అప్పలకొండల రావు, గొంతిన రామకృష్ణ, త్రిపర్ణ రాజేష్, ఉల్లింగుల సురేష్, వెల్లంకి రాజు, నక్క నాగేశ్వరరావు, కోలా సురేష్, కరణం రాజు (ఇసుక రాజు), గొంతిన సర్వేశ్వరరావు, సంభంగి కిరణ్ కుమార్, ఆరేపాపు విక్రమ్, సిరిపురపు కోట, బి.దుర్గారావు, భక్తులు పాల్గొన్నారు.

వేధింపులు, అల్లర్లపై ఆరా



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప శివ కిశోర్

పెదపాడు : వేధింపులు, అల్లర్లు వంటి ఘటనలపై ఎస్పీ కె.తాప శివకిశోర్ ఆరా తీశారు. శుక్రవారం సాయంత్రం ఆయన పెదపాడు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. మహిళా పోలీసులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి రావాల్సిన ఇంక్రిమెంట్లు, డీపీఓ నుంచి ఎవైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. పోలీసులు తమకున్న విజ్ఞానాన్ని పనిని మెరుగుపర్చడంలో వినియోగించాలని సూచించారు. తొలుత గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించారు. పోలీసు స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న సచివాలయ భవనంలోకి మార్చేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ భవనమంతా కలియతిరిగి పరిశీలించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. ఎస్పీ వెంట డీఎస్పీ పీఎస్‌వీవీ ప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కట్టా శారద సతీష్, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి



క్షయపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: క్షయ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, క్షయని తొలిదశలోనే గుర్తిస్తే నివారణ పూర్తిగా సాధ్యమని వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలో క్షయపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. క్షయపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, క్షయ లక్షణాలను ప్రజలకు తెలియచేయాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని కోరారు. పీహెచ్‌సీలో ఉచితంగా టీబీ పరీక్షలకు సైటిబి పరీక్ష చేసి వ్యాధినిర్ధారణ అయితే ఆరె నెలలపాటు మందులు వాడితే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. గ్రామంలో క్షయపై అవగాహనకల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. సిహెచ్‌వోలు జాలాది విల్సన్, వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేట షిర్డీ సాయి ప్రేమ మందిర్ ఆరో వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం తెల్లవారు జామున సాయి భక్తులచే నగర సంకీర్తనలు, ఉదయం 9 గంటలకు బాబా వారికి వివిధ పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం వాసా ప్రసాదరావు సత్సంగం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శేజ్ హారతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాబా సేవకులు పాల్గొని సేవలను అందించారు.

దళితుల విభజన రాజ్యాంగ విరుద్ధం



ముళ్లగిరి జాన్సన్

భీమడోలు: ఎస్సీ వర్గీకరణ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దళితులను విభజించడం రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర దళిత మాల నాయకులు, వైఎస్సార్ సీపీ భీమడోలు ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో శుక్రవారం ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా కాకుండా, 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేశారని పేర్కొన్నారు. దీనిని తామంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దళితులకు రాజ్యాంగ కల్పించిన ఫలాలను సమానంగా పంచాలని, విభజించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని వివరించారు. పార్లమెంట్‌లో చట్టం చేయకుండా సుప్రీంకోర్టు తీర్పును లెక్కచేయకుండా దళితులను విభజిస్తే సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి తిప్పలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో మాలలు 70 లక్షల మంది ఉండగా, 40 లక్షల మంది అంటూ తప్పుల లెక్కల చూపించారని వివరించారు. కూటమి సర్కారు దళితులకు తీరని అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదికకు మాలలు వ్యతిరేకమని, 2026లో జనాభా లెక్కల ఆధారంగా మాలజాతిని లెక్కించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యుడు జి.సూర్యకిరణ్‌తో కలిసి జీవరత్నం మాట్లాడుతూ గత ఆరు రోజుల నుంచి గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. తొలుత సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ స్లీవజోజికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, జోడే సూరిచంద్రరావు, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

కామవరపుకోట: గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజా నాగ సరస్వతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీవో ఎం.సరళకుమారి, తహసీల్దార్ జి.ఎలీషా, కామవరపుకోట మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	44	బీన్లచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	48
బెండకాయలు	34	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	76
కాకర కాయలు	34-38	బీట్‌రూట్	30
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20-40	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34